GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595



# క్రైమ్ THE మిర్రర్ ®
Voice of Anti Corruption
## తెలంగాణ జిల్లాలు
బుధవారం 10-06-2026 పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్


ఒకప్పుడు నాణ్యమైన విద్య కోసం ప్రైవేట్ పాఠశాలలే ఏకైక ప్రత్యామ్నాయంగా భావించిన తల్లిదండ్రులు ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల వైపు ఆసక్తి చూపుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు విద్యా ప్రమాణాలను పెంచుకుంటూ, విద్యార్థులకు సమగ్ర విద్యను అందిస్తూ ప్రైవేట్ పాఠశాలలకు గట్టి పోటీగా నిలుస్తున్నాయి. నాణ్యమైన బోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మెరుగైన మౌలిక సదుపాయాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, పోషకాహార మధ్యాహ్న భోజనం, క్రీడలకు ప్రాధాన్యత వంటి అంశాలు తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి.

# ప్రైవేట్‌కు బ్రేక్



## ప్రభుత్వ బడుల వైపు పేరెంట్స్ యూటర్న్..!!

- ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యా ప్రమాణాలు
- కీలక పాత్ర పోషిస్తున్న అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సేవలు
- ఉచిత సౌకర్యాలు, పోషకాహారంతో విద్యార్థుల ఆకర్షణ
- క్రీడలు, డిజిటల్ విద్యలోనూ ముందంజ
- మహాదేవపూర్ మండలంలో పెరుగుతున్న అడ్మిషన్లు

2లో

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి**

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. సబ్జెక్టుల వారీగా బోధన, నిరంతర మూల్యాంకన విధానం, ప్రత్యేక తరగతులు, సందేహ నివృత్తి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారు. కేవలం పరీక్షల్లో మార్కులు సాధించడమే కాకుండా, విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలు, సృజనాత్మకత పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తెలుగు, ఇంగ్లీష్, గణితం, సైన్స్ వంటి ప్రధాన సబ్జెక్టుల్లో విద్యార్థుల ప్రాథమిక నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ఫలితంగా విద్యార్థుల విద్యా స్థాయి పెరుగుతూ, ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోంది.

# వామ్మో బ్యాథోల్..! ఎన్ని ఇసుక ఫిల్టర్లో..!!

- వాగును పూర్తిగా తవ్వేస్తుంటే అధికారులు కనిపించడం లేదా? లేక కనిపించనట్లు నటిస్తున్నారా..?
- నక్కవాగును కాపాడాల్సిన శాఖలే మాఫియాకు అండగా నిలుస్తున్నాయనే అనుమానాలు ప్రజల్లో పెరుగుతున్నాయి
- ఇప్పుడు ఇసుక కోసం వాగును తవ్వుతున్నారు... రేపు వరదలు వస్తే బాధ్యత ఎవరు తీసుకుంటారు..?
- పదుల సంఖ్యలో ఫిల్టర్లు నడుస్తున్నా అధికారులు తెలియదనడం ప్రజలను మోసం చేయడమే
- సహజ సంపదను కొందరు దోచుకుంటుంటే ప్రభుత్వం ఆదాయాన్ని, ప్రజలు భద్రతను కోల్పోతున్నారు
- ముడుపుల మత్తులో అధికారులు మౌనం పాటిస్తున్నారనే ప్రచారానికి వారి నిర్లక్ష్యమే బలం చేకూరుస్తోంది
- వెంటనే విచారణ జరపాలని స్థానికుల డిమాండ్
- నక్కవాగును ధ్వంసం చేస్తున్న ఇసుక మాఫియా, నక్కవాగుపై దండయాత్ర
- 50 అడుగుల లోతు వరకు అక్రమ తవ్వకాలు చేస్తే వన్యప్రాణులకు పొంచి ఉన్న ప్రమాదం
- వరద ముప్పులో బ్యాథోల్, అరుట్ల, చిద్రుప్ప గ్రామాలు
- ఫిర్యాదులు చేసినా స్పందించని రెవెన్యూశాఖ అధికారులు
- ముడుపుల ఆరోపణలతో అధికార యంత్రాంగంపై పలు అనుమానాలు
- సహజ సంపద పరిరక్షణపై ప్రజల ఆందోళన పెరుగుతోంది

8లో



# ఐదు రోజులపాటు అప్రమత్తం 'భారీ వర్షాల ముప్పు'..!!

- మారనున్న వాతావరణం..భారీ వర్షాలు కురిసే అవకాశం
- ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణే లక్ష్యమంటున్న అధికారులు
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన
- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులకు ప్రత్యేక హెచ్చరిక
- వాతావరణ యాప్‌ల ద్వారా తాజా సమాచారం తెలుసుకోవాలని సూచన

7లో



# తిరుమల శ్రీకాళహస్తిలలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు

**ఆత్మకూరు(ఎం),జూన్9/క్రైమ్ మిర్రర్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీకాళహస్తి దేవస్థానం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గారు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ముందుగా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం, శ్రీకాళహస్తికి చేరుకున్న బీర్ల అయిలయ్య ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ సంప్రదాయాలను అనుసరించి భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకి వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు.రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, తెలంగాణ అభివృద్ధి మరింత ముందుకు సాగాలని ఆయన స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తులు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యని



ఆప్యాయంగా పలకరించగా, ఆయన కూడా భక్తులతో మమేకమై మాట్లాడారు.తిరుపతి దర్శనం అనంతరం శ్రీకాళహస్తి స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని ఆయన పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు కష్టాలు

### సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి పాండు

**ఆత్మకూరు(ఎం),జూన్9/క్రైమ్ మిర్రర్:** కాంగ్రెస్ పార్టీ అధికారంలో రైతులకు తప్పని బాధలు అని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు అన్నారు.మంగళవారం రోజున యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సమావేశం రచ్చ గోవర్ధన్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు రైతులకు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని రైతులు ఆరు కాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ఐకెపి మార్కెట్లోకి తీసుకొచ్చి నెలలు గడుస్తున్న నేటికీ కొనుగోలు చేయలేదని గాలి దుమారం వర్షాలు పడడంతో వడ్లు కరాబ్ అవుతున్నాయని రైతులు కంటతడి పెట్టే పరిస్థితి వచ్చిందని గతంలో ఎప్పుడు లేని విధంగా నెల తరబడి కల్లాల్లో వరి ధాన్యం ఉన్నదని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదని రైతు సంక్షేమమే మా ధ్యేయంగా పనిచేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులు కల్లాలోకి తీసుకొచ్చిన వరి ధాన్యం కండ్లకు కనబడతలేదా అని వారు ప్రశ్నించారు.అప్పులు చేసి పంటలు పండించి వరి ధాన్యం



కల్లాల్లోకి తీసుకొస్తే కమిషన్ దారులు ఒకపక్క ప్రభుత్వం రైతులను అనేక రూపాలుగా దోచుకుంటున్నదని ఇది కాంగ్రెస్ ప్రభుత్వంలోనే జరుగుతున్నదని వారన్నారు.ఇప్పటికైనా చిత్తశుద్ధితో వర్షాకాలం ప్రారంభమైంది కల్లాల్లో ఉన్న వందల కుప్పలను వెంటనే కొనుగోలు చేయాలని డబ్బులు వెంటనే ఇవ్వాలని వారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వేముల భిక్షం,మండల నాయకులు తుమ్మల సత్యనారాయణ రెడ్డి, మల్లెల శ్రీశైలం,గుండెబోయిన స్వామి,బద్దం హరిబాబు, హనుమంతుల మల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావును మర్యాద పూర్వకంగా కలిసిన ఆత్మకూరు(ఎం)మండల బిజెపి నాయకులు

### ఉపసర్పంచుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జిగ నరేష్

**ఆత్మకూరు(ఎం),జూన్9/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట క్షేత్రంలోని వైఎల్ఎన్ఎస్ సత్రంలో మంగళవారం రోజున యాదాద్రి భువనగిరి జిల్లా శిక్షణ తరగతులకు మార్గదర్శనం చేయడానికి విచ్చేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావుని, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు బొట్టు అబ్బయ్య, జిల్లా నాయకులు బొబ్బల ఇంద్రారెడ్డిల సమక్షంలో ఉపసర్పంచ్ ల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జిగ నరేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ ల చెక్ పవర్ తొలగింపు అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఉపసర్పంచ్ లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి,వాటి పరిష్కారం కోసం తగిన చర్యలు చేపట్టాలని కోరారు.అలాగే ఈ నెల 19, 20 తేదీలలో నిర్వహించనున్న ఉపసర్పంచ్ ల ఫోరం అఖిలపక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై, ఉపసర్పంచ్ ల సమస్యల పరిష్కారానికి తన మద్దతు అందించాలని ఆహ్వానించారు. దీనిపై వెంటనే స్పందించిన ఎన్. రామచంద్రరావు,ఉపసర్పంచ్ ల సమస్యల పరిష్కారం జరిగేంత వరకు తమకు అండగా ఉంటానని,సంబంధిత అంశాన్ని పార్టీ మరియు ప్రభుత్వ స్థాయిలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఉపసర్పంచ్ ల హక్కులు,అధికారాల పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఐక్యంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి కొనసాగుతుందని ఉపసర్పంచ్ ల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జిగ నరేష్ తెలిపారు.






# తిమ్మాపురం గ్రామంలో బడిబాట కార్యక్రమం

### ఊరిలో గుడి బడి ఉంటేనే అది నిజమైన ఊరు

**ఆత్మకూరు(ఎం),జూన్9/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం తిమ్మాపురం గ్రామంలో మంగళవారం రోజున బడిబాట కార్యక్రమం నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు సంతోష్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు నమస్కారం,గత రెండు సంవత్సరాలుగా మన ఊరి పాఠశాల మూతబడింది.ఒక ఊరిలో గుడి బడి ఉంటేనే అది నిజమైన ఊరు.ఈ సంవత్సరం మన ఊరి పాఠశాలను ప్రారంభించాలని అనుకుంటున్నామనీ అందుకుగాను గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు,విద్యార్థుల తల్లిదండ్రులు,ముఖ్యంగా మహిళలు సహకరించాలని కోరుకుంటున్నామనీ అన్నారు.

# డా. బి ఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు కు బొట్ల రాజేశ్వర్ ఎంపిక

**యాదాద్రి భువనగిరి జిల్లా :** బొమ్మలరామారం మండలంలోని జలాల్పురం గ్రామ లైన్మెన్ గా పనిచేస్తున్న బొట్ల రాజేశ్వర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు 2026 సంవత్సరమునకు ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు మాట్లాడుతూ బొట్ల రాజేశ్వర్ ఒక ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ మరియు ఎస్సీ ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కొరకు హక్కుల సాధనలో భాగంగా ముందుండి అనేక కార్యక్రమాలు చేపట్టిన సందర్భంలో జూలై 12 తేదీన హైదరాబాదులో అవార్డు అందజేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా మూటకొండూరు గ్రామానికి చెందిన తనకు ఈ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఎలక్ట్రిసిటీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా సెక్రెటరీగా ఉన్న బొట్ల రాజేశ్వర్ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలలో ఉన్న సాహిత్యాన్ని, వారి సమస్యలు పరిష్కరించడంలో ముందుకు తీసుకుపోతున్నందుకు గాను ఈ అవార్డు తనకు రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. తమతో పని చేస్తున్న తోటి ఉద్యోగి బొట్ల రాజశేఖర్ కు డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు రావడం పట్ల యాదాద్రి భువనగిరి జిల్లా ఉద్యోగస్తులు, సామాజిక కార్యకర్తలు, అభిమానులు,కుటుంబ సభ్యులు,అధికారులు, అనధికారులు శుభాకాంక్షలు తెలిపారు.



# సామాన్య మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్న కేంద్రం

- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు గాదె కవిత నరేందర్ రెడ్డి



**ఆత్మకూరు(ఎం),జూన్ 09/క్రైమ్ మిర్రర్:** రెండు సార్లు గ్యాస్ ధరలు పెంచి సామాన్య మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు గాదె కవిత నరేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు . కేంద్ర ప్రభుత్వం ఇట్లా ఇష్టం వచ్చిన రీతిలో గ్యాస్ పైన , పెట్రోల్ పైన , డిజిల్ పైన ధరలు పెంచుకుంటే పోతే ప్రజల ఎట్లా బతకాలని ప్రశ్నించారు . ధరల పెరుగుదల చూస్తుంటే సామాన్య ప్రజలకు కుటుంబ పోషణ బరువై అప్పుల పాలు కాక తప్పదని అన్నారు . ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాలనలో అచ్చేదిన్ ఏమో గాని చచ్చేదినాలు వచ్చాయని అన్నారు .

# నాదర్గుల్లో శ్రీ వాసన్స్ అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్ 10వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** నాదర్గుల్ గ్రీన్ హోమ్స్ కాలనీ సమీపంలోని శ్రీ వాసన్స్ అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్స్‌లో అకాడమీ 10వ వార్షికోత్సవ వేడుకలు మరియు నూతన శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమం ఈనెల 6న అకాడమీ చైర్మన్ వాణి, మేనేజింగ్ డైరెక్టర్ సంపత్ కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి హాజరై నూతన అకాడమీని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ పది సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందిస్తున్న శ్రీ వాసన్స్ అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్ ఇప్పటికే పలు ప్రాంతాల్లో తన సేవలను విస్తరించింది. తాజాగా నాదర్గుల్ లో నూతన శాఖను ప్రారంభించడం విశేషం. అకాడమీలో కరాటే, డ్యాన్స్, మ్యూజిక్, ట్యూషన్స్ మరియు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌లు నిర్వహించబడుతున్నాయని, దీనికి సంబంధించిన సర్టిఫికెట్స్ కూడా యానివర్సరీలో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు కరాటే రంగానికి చెందిన నరేంద్ర, శ్రీనివాస్, సాయి కుమార్, అశోక్ చక్రవర్తి, నాదర్గుల్ ప్రాంతానికి చెందిన రాజకీయ నాయకులు యల్చల మమత సుదర్శన్ రెడ్డి, ఇంద్రసేన, కోటగిరి జంగయ్య, కుమార్ గౌడ్, నరేష్ చారి, లక్ష్మీ యాదవ్ తదితరులు పాల్గొని అకాడమీ అభివృద్ధికి శుభాకాంక్షలు తెలియజేశారు.




# ఆత్మకూరు(ఎం)మండల ఐకేపీ,పిఎసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కుప్పలు

- అధికారుల నిర్లక్ష్యంతో రైతుల ఆందోళన
- మృగశిర కార్తి వచ్చినా కొనుగోలు పూర్తి కావటంలేదు
- రైతుల సంఘాల ఆరోపణలు



**ఆత్మకూరు(ఎం),జూన్9/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల పరిధిలోని ఐకేపీ,పిఎసీఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు తెచ్చిన వడ్లు కుప్పలు కుప్పలుగా పడి ఉన్నా అధికారులు కదలడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మృగశిర కార్తి వచ్చి వర్షాకాలం ప్రారంభంమైన కూడా ధాన్యం కొనుగోలు పూర్తి కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**రైతుల ఎదురుచూపులు:**

ఆత్మకూరు(ఎం)మండలంలోని ఐకేపీ,పిఎసీఎస్ కొనుగోలు కేంద్రాలకు వడ్లు తీసుకొచ్చిన రైతులు రోజుల తరబడి ఎదురుచూస్తున్నారు.వర్షాకాలం ప్రారంభమైనందున తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు వస్తే వడ్లు తడిసి నష్టం వాటిల్లుతుందని భయపడుతున్నారు. రైతులకు భరోసా కరువు: "మాకు భరోసా ఇవ్వండి మహాప్రభో… వడ్ల కొనుగోలు చేయండి" అంటూ రైతులు ప్రభుత్వాన్ని, అధికారులను వేడుకుంటున్నారు.అధికారులు మాటలకే పరిమితమవుతున్నారని, చేతల్లో శూన్యమని ఆరోపించారు. "ఒక్క గింజ వదలము" అని చెప్పిన ప్రభుత్వం మాటలు మాత్రమేనని,క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదని మండిపడ్డారు.

**అధికారుల నిర్లక్ష్యం :** ఐకేపీ, పిఎసీఎస్ కొనుగోలు కేంద్రాలలో తగిన సిబ్బంది,లారీలు,బస్తాలు సిద్ధంగా లేకపోవడంతో కొనుగోలు ఆలస్యమవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వడ్లు కుప్పలుగా పడి ఉండటంతో తడిసే ప్రమాదం ఉందని,దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.అధికారులు వారి కార్యాలయాలకే సీట్లకే పరిమితం.. ఏ ఒక్క అధికారి కూడా రైతులకు భరోసా ఇవ్వకపోవడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. వెంటనే చర్యలు తీసుకోవాలి : వెంటనే ప్రభుత్వం అధికారులు స్పందించి వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, వర్షాలు వచ్చేలోపు అన్ని వడ్లు కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు.

# ప్రైవేట్ పాఠశాలల ఫీజుల భారం.. మధ్యతరగతి కుటుంబాలకు తీరని ఆందోళన



**ఆత్మకూరు(ఎం),జూన్9/క్రైమ్ మిర్రర్:** పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం మరింత పెరిగింది. ప్రైవేట్ పాఠశాలల ఫీజులు, పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, రవాణా చార్జీలు, ఇతర విద్యా ఖర్చులు భరించలేక అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వేల రూపాయల ఫీజులు చెల్లించాల్సి రావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు చదువుతుంటే పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది. పాఠశాలలు సూచించిన దుకాణాల్లోనే పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయాల్సి రావడంతో ఖర్చులు మరింత పెరుగుతున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, వైద్య ఖర్చులు పెరిగిన నేపథ్యంలో విద్యా ఖర్చులు కూడా భారీగా పెరగడం మధ్యతరగతి కుటుంబాలకు భారంగా మారింది. పిల్లల చదువుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలని భావిస్తూ అప్పులు చేసి మరీ




ఫీజులు చెల్లిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, పుస్తకాలు, యూనిఫాంల ధరలపై పర్యవేక్షణ పెంచాలని, మధ్యతరగతి కుటుంబాలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. "పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు కష్టపడటం సహజమే.. కానీ విద్య వ్యాపారంగా మారి మధ్యతరగతి కుటుంబాలపై భారం మోపడం ఆందోళన కలిగించే అంశం" అని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర నాయకులు దామరోజు వీరాచారి మరియు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

# కుక్కల దాడిలో పెద్దజాతి పుంజుకోళ్లు మృతి

**చండూరు,క్రైమ్ మిర్రర్:** కుక్కల దాడిలో పెద్దజాతి పుంజుకోళ్లు మృతి చెందిన ఘటన చండూరు మున్సిపాలిటలో మంగళవారం చోటు చేసుకుంది. చండూరుకు చెందిన ఎర్రజెల్ల రమేష్ కస్తాల మార్గంలోని తన ఖళీ స్థలంలో పెద్దజాతి పుంజు (పందెం) కోళ్లు సాదుతున్నాడు. మంగళవారం కుక్కల దాడిలో 15 కోళ్లు మృతి చెందాయి. దీంతో తనకు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని మనుషులతో పాటు మూగజీవులపైన దాడులు చేస్తున్నాయని...వెంటనే కుక్కలను నియంత్రించాలని స్థానికులు మున్సిపాలిటీ పాలకవర్గాన్ని డిమాండ్ చేస్తున్నారు.



# విద్యా, ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించండి!

**ఎస్టీయూ అధ్యక్షులు శ్రీధర్ రావు**




**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** ఎస్ టి యు 80వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా సంఘ కార్యాలయంలో అధ్యక్షులు కొత్త శ్రీధర్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) తన 79 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుందని, ఈ సంఘం 1947 జూన్ లో స్థాపించబడి ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం మరియు విద్యా అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తోందని అన్నారు. ఉపాధ్యాయుల వేతనాలు, పదోన్నతులు, సేవా భద్రత వంటి అంశాలపై అలుపెరగని పోరాటాలు చేసిందని ప్రభుత్వ పాఠశాలల బలోపేతం మరియు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తుందని,విద్యా రంగంలో వచ్చిన అనేక మార్పులు,సంస్కరణలలో ఎస్టీయూ కీలక పాత్ర పోషించింది. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాల కోసం కృషి చేసిందన్నారు. ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి మరియు విద్యార్థుల శ్రేయస్సుకు సేవలు అందించింది. 80 సంవత్సరాల చరిత్రలో అనేక మంది నాయకులు, కార్యకర్తలు సంఘాన్ని బలోపేతం చేశారు.భవిష్యత్తులో కూడా ఉపాధ్యాయ సంక్షేమం, విద్యా నాణ్యత పెంపు, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం లక్ష్యాలుగా కొనసాగుతామని పేర్కొన్నారు. 40 రోజుల కిందట ముఖ్యమంత్రి గారు ఇచ్చిన తక్షణ హామీలలో పీఆర్సీ గానీ, హెల్త్ కార్డులు గానీ, సీపీ యస్ విషయం గానీ, అమలు కాకపోగా 16 వేల ప్రాథమిక బడులలో 4వేల వరకు ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించాలనడం, క్షేత్రస్థాయిలో పబ్లిక్ స్కూల్స్ కు తగిన ఏర్పాట్లు, వసతులు కల్పించకుండానే అడ్మిషన్లు అయ్యే సమయంలో ప్రారంభిస్తామనడం సరి కాదని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి,పూర్వ అధ్యక్షులు మురళి, ఎస్ టి యు రాష్ట్ర నాయకులు రమేష్, అనిల్ కుమార్ రెడ్డి, ప్రభాకర్,జిల్లా మండల ప్రతినిధులు ఎ. హన్మంత రెడ్డి, మద్దిలేటి, ఈశ్వర్,కర్ణాకర్ రెడ్డి, బాలస్వామి,హన్మంతు, నర్సింహ్మా, సురేష్ బాబు, సత్యనారాయణ, వెంకటస్వామి, రాజన్ గౌడ్, నారాయణ, రాజేష్,లక్ష్మి నరసింహ రెడ్డి మొదలైన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడికి కఠిన శిక్ష విధించాలి

- ఖమ్మం బాలికపై అత్యంత దారుణ లైంగిక దాడి ఘటనను సీపీఎం తీవ్రంగా ఖండిస్తుంది.
- నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి.
- బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి.
- సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం నగరంలో 12 సంవత్సరాల బాలికపై జరిగిన అత్యంత అమానుషమైన లైంగిక దాడి ఘటనను సీపీఎం ఖమ్మం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. బాధిత బాలికను పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికపై లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా ఆధారాలు లేకుండా చేయాలనే దురుద్దేశంతో నాలుగు అంతస్తుల భవనం పైనుంచి కిందకు తోసివేయడం సభ్య సమాజం తలదించుకునే అత్యంత ఘోరమైన నేరమని అన్నారు. మహిళలు, బాలికలపై రోజురోజుకు పెరుగుతున్న లైంగిక దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని, చట్టాల పట్ల నేరస్తులకు భయం లేకపోవడమే ఇలాంటి ఘటనలకు కారణమవుతోందని అన్నారు. ప్రభుత్వం మహిళల భద్రత విషయంలో మాటలకే పరిమితం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో నిందితుడిని వెంటనే అరెస్టు చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి అత్యంత కఠిన శిక్ష విధించాలని కోరారు. బాధిత బాలికకు మెరుగైన వైద్య చికిత్సను పూర్తిగా ప్రభుత్వ ఖర్చులతో అందించడంతో పాటు, బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ బాలికలపై, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, నేరస్తులపై ఉదాహరణాత్మక శిక్షలు అమలు చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి సీపీఎం సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తోందని, న్యాయం జరిగే వరకు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రం, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ నవీన్ రెడ్డి, దొంగల తిరుపతిరావు, నగర నాయకులు పత్తిపాక నాగ సులోచన, భాగం అజిత, కూచిపూడి నరేష్, బీబీ ,కుమారి, సుజిత, పావని, అమీనా తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీలో సీఎం రేవంత్ రెడ్డి సభ విజయవంతం చేద్దాం



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలంలో ఫ్యూచర్ సిటీ డిపార్ట్మెంట్ అథారిటీ నూతన కార్యాలయ పనులను మరియు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు సంబంధించిన పనుల పరిశీలన కోసం విచ్చేసిన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డిని సన్మానంతో స్వాగతించిన గుడ్ల శ్రీనివాస్ మహారాజ్, పుట్టగల జగన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివగల యాదయ్య తదితరులు. నేడు జరగబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు ప్రజలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని గుడ్ల శ్రీనివాస్ తెలిపారు.

# మహిళా అదృశ్యం



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 42 సంవత్సరాల మహిళ అదృశ్యమైనట్లు బాలాపూర్ పోలీస్స్టేషన్లో కేసు నమోదు అయింది. బాలాపూర్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం షహీన్ నగర్ బిస్మిల్లా కాలనీలో నివాసం ఉండే షహీన్ బేగం వయస్సు 42, ఈనెల 7న సాయంత్రం నాలుగున్నర సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోవడం జరిగిందని, ఈ మహిళ భర్త అయినా వసిముల్లా ఖాన్ తన బంధువుల దగ్గర మరియు చుట్టుపక్కల ప్రాంతాలలో వెతికిన ఆచూకీ లభ్యం కాకపోవడంతో బాలాపూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందని, ఆచూకీ తెలిసినవారు బాలాపూర్ పోలీసులకు సమాచారం అందించాలని ఒక ప్రకటనలో తెలిపారు.

# ఇస్నాపూర్ మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు కేటాయించాలి

**మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేసిన నీలం మధు ముదిరాజ్**

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూన్ 09:** పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఇస్నాపూర్ మున్సిపాలిటీని ప్రత్యేకంగా పరిగణించి అదనపు నిధులు కేటాయించాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ నీలం మధు ముదిరాజ్ రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామిని కోరారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి హాజరైన మంత్రి వివేక్ వెంకటస్వామికి ఇస్నాపూర్ చౌరస్తాలో ఘన స్వాగతం పలికి, మున్సిపల్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో పలు అభివృద్ధి, ప్రజా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ చిట్కుల్ పరిధిలోని 329 కాలనీ, ఇస్నాపూర్ ఇందిరమ్మ కాలనీల్లో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించినప్పటికీ, ఇప్పటికీ అనేక మౌలిక సదుపాయాల సమస్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆ కాలనీల్లో అంతర్గత రహదారులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు, తాగునీటి సౌకర్యం, ఇంటి నంబర్లు, విద్యుత్ మీటర్ల ఏర్పాటు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మంత్రిని కోరినట్లు చెప్పారు. అలాగే నేషనల్ హైవే నుంచి లక్డారం, బ్యాథోల్, రుద్రారం, ఏర్థనూర్ వరకు రహదారి అభివృద్ధి చేసి, ఇరు వైపులా ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం కేటాయించిన రూ.15 కోట్ల నిధులతో పనులు ఇప్పటికే ప్రారంభమైనట్లు మంత్రికి వివరించిన ఆయన, మున్సిపాలిటీ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం మరిన్ని ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాట శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు నారాయణదాసు, మన్నే రాఘవేందర్, వెంకటేష్ నాయక్, నర్సింహారెడ్డి, గోపాల్, దస్తగిరి, మణికంత, నాయకులు వల్లపు వెంకటేష్, మురళి, మహేష్, అనిల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.





# బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

- ప్రతి బూత్‌లో డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి
- ఇంటింటికీ వెళ్లి ప్రజలను సభ్యులుగా నమోదు చేయాలి
- ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలి
- ఓటరు జాబితా సవరణకు కూడా సభ్యత్వ నమోదు కార్యక్రమం దోహదపడుతుంది

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూన్ 09:** రామచంద్రాపురం డివిజన్‌లో అవగాహన సమావేశంలో ఆదర్శ్ రెడ్డి పిలుపు పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బూత్ స్థాయి వరకు విస్తృతంగా చేపట్టి పార్టీని మరింత బలోపేతం చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఆదేశాల మేరకు రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ సూచనల మేరకు ప్రతి బూత్‌లో డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగంపై అవగాహన ఉన్న ఇద్దరు యువతతో పాటు ఒక సీనియర్ బూత్ కోఆర్డినేటర్‌ను ఎంపిక చేసి ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టాలని సూచించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ప్రజలను చేరుకునే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా తీసుకెళ్లాలని, సభ్యత్వ నమోదు ద్వారా పార్టీకి మరింత బలం చేకూర్చాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి కూడా ఈ సభ్యత్వ నమోదు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. బూత్ స్థాయిలో ఓటర్ల వివరాలను పరిశీలించడం ద్వారా డూప్లికేట్ ఓటర్లు, మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను గుర్తించే అవకాశం ఉంటుందని ఆదర్శ్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, పరమేష్ యాదవ్, గోవింద్ యాదవ్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.



# తలారి హరికృష్ణ ముదిరాజ్ ది ముమ్మాటికీ హత్యే



**తాండూరు, జూన్ 09(క్రైమ్ మిర్రర్):** బషీరాబాద్ మండలం జీవంగి గ్రామానికి చెందిన యువకుడు తలారి హరికృష్ణ ముదిరాజ్ మృతి కేసులో నిందితులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని ముదిరాజ్ సంఘం, దళిత, మైనార్టీ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

**ఘటన నేపథ్యం:**

తలారి హరికృష్ణ ఏప్రిల్ 29, 2026న పని నిమిత్తం రుద్రారం గ్రామానికి వెళ్లగా, అదే రోజు మధ్యాహ్నం అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా, వారు సరైన రీతిలో స్పందించలేదని, ఆధారాలు సేకరించడంలో విఫలమవ్వడమే కాకుండా, నిందితులను కాపాడే విధంగా వ్యవహరిస్తున్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ముదిరాజ్ సంఘం, ప్రజా సంఘాల సహకారంతో పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం తాండూరులో జరిగిన విలేకరుల సమావేశంలో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ ముదిరాజ్ (తాండూర్ పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు), కే. శ్రీనివాస్ (సీఐటీయూ ప్రధాన కార్యదర్శి), అబ్దుల్ వాహబ్ (టి ఎస్ ఎం ఎస్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు), కే. చంద్రయ్య (ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు), గుమ్మడి రత్నం (కెవిపిఎస్ నాయకులు), మొహమ్మద్ సాధిఖ్ (టి ఎస్ ఎం ఎస్ పి ఎస్ తాండూర్ పట్టణ ఇంచార్జ్), బలరాం (ఎం ఆర్ పి ఎస్ తాండూర్ టౌన్ ప్రెసిడెంట్), మంతట్టి రాజు ముదిరాజ్, శానప్ప ముదిరాజ్, శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**హెచ్చరిక:** ఒకవేళ నిందితులను వెంటనే అరెస్ట్ చేయకపోతే, జూన్ 11న తాండూర్ ఆర్డీవో కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహిస్తామని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు.

# సామాజిక ఉద్యమాల సృష్టికర్త ఎమ్మార్పీఎస్ - దుబ్బ రామకృష్ణ



**సంస్థాన్ నారాయణపురం, జూన్ 09(క్రైమ్ మిర్రర్):** సామాజిక ఉద్యమాల సృష్టికర్త ఎమ్మార్పీఎస్ ఉద్యమమని యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ అన్నారు. మంగళవారం సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా దుబ్బ రామక్రిష్ణ పాల్గొని వారు మాట్లాడుతూ ఈ తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా భారతదేశంలో అనేకమైన సామాజిక ఉద్యమాలు సృష్టించి విజయం సాధించిన చరిత్ర ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి ఉందని ఆయన అన్నారు. మందకృష్ణ మాదిగ నేతృత్వంలో 30 సంవత్సరాల క్రితం ఏర్పడినటువంటి ఎమ్మార్పీఎస్ (దండోరా) ఉద్యమం ఆనాటి నుంచి నేటి వరకు అనేక ఉద్యమాలకు నాంది పలుకుతుందని వారు అన్నారు. ఎక్కడ ఏ జాతికి అన్యాయం జరిగిన న్యాయం వైపు ఉండి కొట్లాడే సంఘం ఎమ్మార్పీఎస్ అని అన్నారు. రాష్ట్రంలో వచ్చిన ఆరోగ్యశ్రీ పథకం కావచ్చు, వికలాంగుల, వితంతువుల పింఛన్లే కావచ్చు అన్నిటికీ ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితమే అని వారన్నారు. అదే విధంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఎమ్మార్పీఎస్ ది కీలక పాత్ర అని ఆయన అన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితంగా వచ్చినటువంటి ఎస్సీ వర్గీకరణ ఫలాలను మాదిగ, మాదిగ ఉపకులాలన్నీ కూడా అందుకోవాలని అందులో భాగంగానే మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామాలకు తరలండి (గో టు విలేజ్) కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ నిర్వహిస్తుందని దాన్ని మండల వ్యాప్తంగా విజయవంతం చేయడానికి అందరూ కృషి చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సంస్థాన్ నారాయణపూర్ మండల కన్వీనర్ గా పండి రాకేష్ ను, మండల కో కన్వీనర్ గా చెరుకుపల్లి హరికాంత్ ను జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ ప్రకటించి నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, అడ్వకేట్ కట్టెల లింగస్వామి, మాదిగ జర్నలిస్టు ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు కలకండ సంజీవ, ఎమ్మార్పీఎస్ చౌటుప్పల్ మండల అధ్యక్షులు బొడ్డు శ్రవణ్, సీనియర్ నాయకులు వలిగొండ యాదయ్య, ఆర్.బి రాములు, కట్టెల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాడితే కేసులా

- కోటపల్లి బీఆర్ఎస్ నాయకులకు పోలీసుల నోటీసులు
- ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన నేతలు



**చెన్నూర్ జూన్ 9 (క్రైమ్ మిర్రర్):** ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న తమపై కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయంగా కేసులు నమోదు చేయించిందని కోటపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పలువురు బీఆర్ఎస్ నాయకులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న తమను అణచివేసేందుకు ప్రభుత్వ పెద్దలు తప్పుడు కేసులను ఆశ్రయిస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై తమ పోరాటాన్ని ఇలాంటి చర్యలతో ఆపలేరని స్పష్టం చేశారు. నోటీసులు అందుకున్న వారిలో సర్పంచ్ తోగరు శ్రీనివాస్, మాజీ సర్పంచులు చందు, ఊరేటి రాజ్‌కుమార్ యాదవ్, నాయకులు ఆకుదారి చందు, కొండు రాజేష్, తాళ్లపెల్లి బాపు, మండల సోషల్ మీడియా ప్రతినిధి బాపు నాయక్ తదితరులు ఉన్నారు. వెనకడుగు వేయబోం ప్రభుత్వం ఎన్ని కేసులు నమోదు చేసినా భయపడబోమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే డా. బాల్క సుమన్ నాయకత్వంలో ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ప్రభుత్వ పాఠశాల నిర్మాణాన్ని అడ్డుకునే ప్రయత్నాలు సిగ్గుచేటు -- సుర్వి రవిగౌడ్

**సంస్థాన్ నారాయణపురం, జూన్ 09(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం అల్లందేవిచెరువు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణం కోసం రాత్రింబవళ్లు కష్టపడుతున్న కార్మికులకు తాత్కాలిక వసతి కల్పించడాన్ని కూడా రాజకీయ వివాదంగా మార్చే ప్రయత్నం చేయడం అత్యంత దురదృష్టకరం. మన గ్రామ పంచాయతీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే సంకల్పంతో, మన గ్రామ సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్ విజ్ఞప్తి మేరకు ఈఎల్వీ భాస్కర్ ఫౌండేషన్ సహకారంతో లక్షల రూపాయల విలువైన పాఠశాల భవనం నిర్మాణం జరుగుతుంటే దానికి సహకరించాల్సింది పోయి, కార్మికులను ప్రభుత్వ భవనాలలో ఉంచారని ఫిర్యాదులు చేయడం అభివృద్ధి వ్యతిరేక రాజకీయాలకు నిదర్శనం. పాఠశాల భవనం కోసం బీహార్ నుండి వచ్చిన మేస్త్రీలు, కార్మికులు గ్రామ ప్రజల పిల్లల భవిష్యత్తు కోసం పనిచేస్తున్నారు. వారు ఏ రాజకీయ పార్టీ కార్యాలయం కోసం రాలేదు, ఏ నాయకుడి వ్యక్తిగత పనుల కోసం రాలేదు. గ్రామ ప్రభుత్వ పాఠశాల నిర్మాణం కోసమే వచ్చారు. ఈ విషయం తెలిసి కూడా ఫిర్యాదులు చేయడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో గ్రామ ప్రజలకు అర్థమవుతోంది. దశాబ్దాలుగా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల పరిస్థితి ఎలా ఉందో పట్టించుకోని వారు, ఇప్పుడు ఆధునిక పాఠశాల నిర్మాణం జరుగుతుంటే అడ్డంకులు



సృష్టించడం ప్రజలు గమనిస్తున్నారు. అభివృద్ధిని చూసి ఆనందించలేని వారు కనీసం అడ్డుపడకుండా ఉండాలి. గ్రామ పిల్లల భవిష్యత్తు కోసం జరుగుతున్న కార్యక్రమాలను రాజకీయ కక్ష సాధింపుకు వేదికగా మార్చడం మానుకోవాలి. నిర్మాణ పనులను ఆపాలని చూసే ప్రతి ప్రయత్నాన్ని గ్రామ ప్రజలు తీవ్రంగా ఖండిస్తారు. ప్రజల సంక్షేమం కోసం చేసే పనులను విమర్శించే వారికి ప్రజలే తగిన సమయంలో తగిన సమాధానం చెబుతారు. గ్రామాభివృద్ధి కోసం పని చేసే వారిని ప్రోత్సహించండి. అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలకు ప్రజల మధ్య చోటు లేదని మరోసారి స్పష్టం చేస్తున్నాము.

# ఐదు రోజులపాటు అప్రమత్తం 'భారీ వర్షాల ముప్పు'..!!

- మారనున్న వాతావరణం..భారీ వర్షాలు కురిసే అవకాశం
- ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణే లక్ష్యమంటున్న అధికారులు
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన
- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులకు ప్రత్యేక హెచ్చరిక
- వాతావరణ యాప్‌ల ద్వారా తాజా సమాచారం తెలుసుకోవాలని సూచన

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రాబోయే ఐదు రోజుల పాటు వాతావరణ పరిస్థితులు తీవ్రంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హైదరాబాద్ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. వాతావరణ శాఖ నివేదికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు ఆయన తెలిపారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు విస్తృతంగా కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశముందని పేర్కొంది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

### పిడుగుల ముప్పు ఎక్కువ

ఆకాశం మేఘావృతమై ఉన్న సమయంలో ఉరుములు, తీవ్రమైన మెరుపులతో కూడిన పిడుగులు పడే అవకాశం అధికంగా ఉందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి అవసరమైన జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు.

### చెట్ల కింద నిలవొద్దు

వర్షాలు, ఉరుములు సంభవించే సమయంలో పెద్ద చెట్ల కింద ఆశ్రయం పొందరాదని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా ఒంటరిగా ఉన్న చెట్లు పిడుగులను ఆకర్షించే అవకాశం ఎక్కువగా ఉండటంతో వాటి సమీపంలో ఉండకూడదన్నారు.

### పక్కా భవనాల్లోనే ఆశ్రయం

ఉరుములు, గాలులు ప్రారంభమైన వెంటనే బలమైన కాంక్రీట్ భవనాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు. బలహీనమైన గోడలు, పాత ఇళ్లు, ప్రమాదకర నిర్మాణాలకు దూరంగా ఉండాలని తెలిపారు.



### రైతులు అప్రమత్తంగా ఉండాలి

వ్యవసాయ పనులు నిర్వహించే రైతులు వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనించాలని కలెక్టర్ కోరారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో పొలాల్లో పనులను తాత్కాలికంగా నిలిపివేయాలని సూచించారు.

### అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు వద్దు

భారీ వర్షాల కారణంగా రహదారులు జారుడుగా మారే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే ప్రమాదం ఉందని తెలిపారు. అత్యవసర పరిస్థితులు మినహా ప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిదన్నారు.

### విద్యుత్, నీటి సరఫరాకు అంతరాయం

బలమైన గాలుల ప్రభావంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడే అవకాశం ఉందని, దీంతో విద్యుత్, నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### వాతావరణ యాప్‌లు వినియోగించండి

ప్రజలు తాజా వాతావరణ సమాచారాన్ని తెలుసుకునేందుకు 'దామిని' యాప్ ద్వారా పిడుగుల హెచ్చరికలు, 'మౌసమ్' యాప్ ద్వారా వాతావరణ అప్‌డేట్లు, రైతులు 'మేఘదూత్' యాప్ ద్వారా వ్యవసాయ సంబంధిత వాతావరణ సమాచారాన్ని పొందాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత అధికారులను వెంటనే సంప్రదించాలని కోరారు.

## ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలుకుదాం : వల్లపు సుభాన్ యాదవ్



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహేశ్వరం నియోజకవర్గం ఫ్యూచర్ సిటీలో పర్యటించనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలుకుదామని మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వల్లపు సుభాన్ యాదవ్ తెలిపారు. అత్యాధునిక వసతులతో నిర్మించిన ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్ అథారిటీ స్కిల్ యూనివర్శిటీ భవనాలను బుధవారం ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని అనంతరం జరిగే బహిరంగ సభలో పాల్గొనాలని నాయకులకు కార్యకర్తలకు వల్లపు సుభాన్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

## ఎమ్మార్వో ఆఫీసులో ఎలుక చచ్చిన వాసన.. ఏసీ గదిలో అధికారి, దుర్వాసనలో జనం!

**జగిత్యాల జిల్లా బ్యూరో(క్రైమ్ మిర్రర్):** గొల్లపల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది, ఆఫీసుకు వచ్చే సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్ని రోజులుగా కార్యాలయ ప్రాంగణంలో భరించలేని దుర్వాసన వస్తుండటంతో, తమ పనుల నిమిత్తం కార్యాలయానికి రావాలంటేనే జనం బెంబేలెత్తుతున్నారు.

### ఏసీ గదుల్లో అధికారులు.. దుర్వాసనలో సామాన్యులు!

కార్యాలయంలో ఎక్కడో చనిపోయిన ఎలుకలు లేదా మరేదైనా కుళ్లిన పదార్థాల వల్ల ఈ భరించలేని దుర్వాసన వస్తోందని స్థానికులు అనుమానిస్తున్నారు. ఎమ్మార్వో తన ఏసీ గదిలో ప్రశాంతంగా కూర్చుని విధులు నిర్వహిస్తుంటే, పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు, అక్కడే పనిచేసే ఇతర కిందిస్థాయి సిబ్బంది మాత్రం ముక్కు మూసుకుని పనులు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

### అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వ కార్యాలయం పరిశుభ్రంగా ఉండాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు మండిపడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వచ్చే ఈ ఆఫీసులో, కనీసం దుర్వాసనను కూడా పసిగట్టలేకపోవడం లేదా దాన్ని తొలగించే చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు ఆరోపిస్తున్నారు.

### తక్షణ చర్యలకు డిమాండ్

దీనిపై అధికారులు తక్షణమే స్పందించి, కార్యాలయ పరిసరాలను శుభ్రం చేయించాలని, దుర్వాసన మూలాలను తొలగించి ప్రజలు, సిబ్బంది ఆరోగ్యానికి ఎటువంటి ముప్పు కలగకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



# వామ్మో బ్యాథోల్..! ఎన్ని ఇసుక ఫిల్టర్లో..!!



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూన్ 09:** కంది మండలంలోని బ్యాథోల్, అరుట్ల, చిద్రుప్ప గ్రామాల పరిసర ప్రాంతాల్లో నక్కవాగు అక్రమ ఇసుక ఫిల్టరింగ్ కేంద్రాలకు అడ్డాగా మారిందనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. సహజ వనరులను కాపాడాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు మౌనం పాటిస్తుండటంతో ఇసుక మాఫియా యథేచ్ఛగా వాగు గర్భాన్ని తవ్వేస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నక్కవాగు పరివాహక ప్రాంతంలో పదుల సంఖ్యలో ఇసుక ఫిల్టర్లు ఏర్పాటు చేసి, భారీ యంత్రాలతో సుమారు 50 అడుగుల లోతు వరకు తవ్వకాలు జరుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాగు నీటినే వినియోగిస్తూ ఇసుకను ఫిల్టర్ చేసి కృత్రిమ ఇసుక తయారు చేస్తున్నారని, టిప్పర్ల ద్వారా నల్లమట్టిని ఇతర ప్రాంతాలకు తరలించి భారీగా అక్రమ వ్యాపారం సాగిస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. కిలోమీటర్ల మేర వాగు సహజ స్వరూపం పూర్తిగా ధ్వంసమైందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ తవ్వకాల కారణంగా నక్కవాగు సహజ ప్రవాహ మార్గం దెబ్బతిని రానున్న వర్షాకాలంలో వరద నీరు గ్రామాల వైపు మళ్లే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా బ్యాథోల్, అరుట్ల, చిద్రుప్ప గ్రామాలు వరద ముప్పును ఎదుర్కొనే పరిస్థితి నెలకొన్నట్లు చెబుతున్నారు. వ్యవసాయ భూములు, ఇళ్లు, రహదారులు దెబ్బతినే ప్రమాదం ఉందని గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ కార్యకలాపాలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎమ్మార్వోకు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు తమకు సమాచారం లేదంటూ తప్పించుకుంటున్నారని మండిపడుతున్నారు. ఇంత పెద్ద ఎత్తున ఇసుక ఫిల్టరింగ్ జరుగుతున్నా అధికారులకు తెలియకపోవడం నమ్మశక్యం కాదని, భారీ ముడుపుల కారణంగానే చర్యలు తీసుకోవడం లేదనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కృత్రిమంగా ఫిల్టర్ చేసిన ఇసుకను నిర్మాణ రంగంలో వినియోగించడం వల్ల భవనాల నాణ్యతపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రమాణాలు పాటించకుండా తయారైన ఇసుకతో నిర్మాణాలు చేపడితే భవిష్యత్తులో ప్రమాదాలు సంభవించే అవకాశాన్ని కొట్టిపారేయలేమని అంటున్నారు. "వాగును పూర్తిగా తవ్వేస్తుంటే అధికారులు కనిపించడం లేదా? లేక కనిపించనట్లు నటిస్తున్నారా?", "ఇప్పుడు ఇసుక కోసం వాగును నాశనం చేస్తున్నారు.. రేపు వరదలు వస్తే బాధ్యత ఎవరు తీసుకుంటారు?", "పదుల సంఖ్యలో ఫిల్టర్లు నడుస్తున్నా తెలియదనడం ప్రజలను మోసం చేయడమే", "ముడుపుల మత్తులో అధికారులు మౌనం పాటిస్తున్నారనే ప్రచారానికి వారి నిర్లక్ష్యమే కారణం" అంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నక్కవాగు విధ్వంసంపై జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టి, అక్రమ ఇసుక ఫిల్టరింగ్ కేంద్రాలను మూసివేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే రానున్న వర్షాకాలంలో సంభవించే నష్టానికి సంబంధిత శాఖలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

**కంది ఎమ్మార్వో వివరణ:** బ్యాథోల్ గ్రామంలో జరుగుతున్న అక్రమ ఇసుక వ్యాపారం గురించి క్రైమ్ మిర్రర్ ప్రతినిధి వివరణ కోరగా ఇట్టి విషయం తనకు తెలువదనిన్నారు. ఆర్ ఐ లేదని వచ్చిన తర్వాత పంపిస్తానని కంది తహశీల్దార్ వివరణ ఇచ్చారు.

## ప్రజాసేవలో ముందున్న పోలీసులకు సత్కారం..!!

- ఉత్తమ పనితీరుకు ప్రశంసాపత్రాల ప్రధానం
- పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంచేలా విధులు నిర్వర్తించాలని పిలుపు



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసు శాఖలో విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబరిచిన పలువురు పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడంలో ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా కర్తవ్యనిష్ఠతో విధులు నిర్వర్తించాలని అన్నారు. క్రమశిక్షణ, నిజాయితీ, సేవా దృక్పథంతో పనిచేసే సిబ్బందిని ఎల్లప్పుడూ గుర్తించి ప్రోత్సహిస్తామని ఎస్పీ తెలిపారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాల ప్రదానం ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంపొందించేలా ప్రతి ఒక్కరూ తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ సేవలందించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పిలుపునిచ్చారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా రాజీతో కేసులను పరిష్కరించుకోండి: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్...



**జగిత్యాల జిల్లా బ్యూరో(క్రైమ్ మిర్రర్):** జూన్ 20, 2026న నిర్వహించబడనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా రాజీ పడదగిన కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, లోక్ అదాలత్‌లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ నిర్వహణకు సంబంధించిన కేసులు, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చిన్నచిన్న పెట్టి కేసులు తదితర రాజీ పడదగిన కేసులను సులభంగా పరిష్కరించుకునే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు."రాజీ మార్గమే రాజమార్గం" అనే భావనతో న్యాయ వ్యవస్థ కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది మరియు ఇతర అధికారులు రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా రాజీ కుదిరేలా అవగాహన కల్పిస్తారని తెలిపారు.తమ కేసులను పరస్పర రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని భావించే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

## సిఐటియు కార్మిక సంఘం ధర్నా....

- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికుల ధర్నా



**సైబరాబాద్ క్రైమ్ మిర్రర్ :** సిఐటియు కార్మిక సంఘం ఆధ్వర్యంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మున్సిపల్ కూకట్పల్లి జోన్,కుత్బుల్లాపూర్ జోన్ , దుండిగల్,గండి మైసమ్మ, బాచుపల్లి, నిజాంపేట్, అమీన్పూర్, శేర్లింగంపల్లి మున్సిపల్ కార్మికులందరూ కమిషన్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమంలో సిఐటి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ అశోక్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరికీ పర్మినెంట్ చెయ్యాలి, కార్మికుల కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలి అదే విధంగా మూడు కార్పొరేషన్ లో పనిచేస్తున్న కార్మికులందరికీ జిహెచ్ఎంసిలో చెల్లిస్తున్నట్లుగా అందరికీ సమాన పని సమాన వేతనాలను తక్షణమే అమలు చేయాలి మున్సిపల్ కార్మికులు ప్రమాదాల్లో మరణించిన వారికి 25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలి 60 సంవత్సరాల వయసు పైబడిన కార్మికులను తొలగిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్ 10 లక్షలు వారసులేని వారికి 15 లక్షల ఇవ్వాలి, మరణించిన కార్మికులకు దహన సంస్కరణకు 30000 రూపాయలు మట్టి ఖర్చులు ఇవ్వాలని అడగాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారాలు పండుగ సెలవులు వారాంతపు సెలవులు అమలు చేయాలని మరియు మూడు కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఎస్ ఎఫ్ ఏ, జవాన్లకు మరియు వర్క్ ఇన్స్పెక్టర్లకు ప్రమోషన్లు కల్పించాలి మున్సిపల్ కార్మికులందరికీ మొదటి ప్రాధాన్యతగా గుర్తించి డబల్ బెడ్ రూమ్ ఇందిరమ్మ ఇల్లును కేటాయించాలని బయోమెట్రిక్ అటెండెన్స్ విధానంలో టెక్నికల్ ప్రాబ్లం వల్ల అటెండెన్స్ కోల్పోతున్నారని వాటిని తొలగించాలని మాట్లాడారు ఈ కార్యక్రమంలో సిఐటియు మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి బి. లింగ స్వామి, ఐలాపురం రాజశేఖర్, శేరిలింగంపల్లి కార్యదర్శి కృష్ణ, బాచుపల్లి మండల కార్యదర్శి రాథోడ్ సంతోష్, అమిన్ పూర్ నాయకులు నాగేశ్వర్, మేడ్చల్ మండల కార్యదర్శి ఎం. నరేష్, కార్మికులు ఎల్లయ్య, పెంటయ్య, స్వామి, బిక్షపతి, సత్యం, రేణుక, పద్మ తదితరులు పాల్గొన్నారు.